# డైరీలో రాధ

## గరిమెళ్ల వెంకటసీతారాం

అప్పుడే భోజనం అయింది. పెరట్లో చెయ్యి కడుక్కొంటూంటే వెనకాలే కాంతం వొచ్చి,

'కిళ్లీ కట్టి టేబుల్ మీద పెట్టేను. తీసుకోండి' అని చెప్పింది.

'సరేలే' అని తువ్వాలతో చెయ్యి తుడుచుకొని గదిలో ప్రవేశించేసరికి మళ్లా కాంతం హాజరు.

'ఇదుగో ఆ పార్కరు పెన్నులో ఇంకు పోసి కోటుజేబులో పెట్టేను నూ[క్రి] పెన్సిల్ చొక్కాజేబుకు తగిలించి రుమాలేమో పాంటుజేబులో ఉంచేను. చూసుకోండి.

'అలాగేలే'

'ఇవాళ మంగళవారం కదూ. ఆ షేక్స్పియర్, షెల్లీ, సెకిల్ కాలేజీకి కట్టేను. ఆ రెండు చాలా, లేక యింకేమైనా కట్టాలా' అని కాంతం ప్రశ్న.

నేను కాలేజీకి బయలుదేరేవరకు నన్ను అంటిపెట్టుకొని నా క్కావాలసిన ప్రతి చిన్న పని చేసిపెట్టుంది, మా కాంతం కాలేజీలో ఏరోజు ఏ పాఠాలు చెప్పాలో నా టైమ్ టేబుల్ అంతా మా కాంతానికి కంఠస్థం.

'ఆ ఇద్దరిని కట్టేశావు కదూ చాలులే.'

'ఫ్లాస్కు మూడుకప్పులు కాఫీ పట్టింది. మీకు సెకండు, ఫోర్తు పీరియడ్స్ కదూ వర్కు. ఆ రెండుసార్లకు రెండు కప్పులు పోగా మిగతా కప్పు ఎవరికైనా దానం చేసెయ్యండి.'

'క్లాసుకి పోయేముందర వేడి వేడి కాఫీ ఇంజనులో పోస్తేనేగాని బండి హుషారుగా నడవదని మా కాంతం అభిప్రాయం.

'ఇదంతా సరేకాని ..యిదుగో ఓమాట.'

'ఏమిటో వేగంగా చెప్పండి. అవతల అంట్లూ, ఎంగిళ్లు తీసి అంతా సవరించుకోవాలి.'

'మరేంలేదు. నిన్న వ్రాసిన కథ ఫెయిర్ చేసి ఆంధ్రపత్రికకు పోస్టు చేసెయ్యి."

నేను కాలేజీలో లెక్చరర్‌గా చేరకముందు నుంచి కథలు వ్రాయడం, పత్రికలకు పంపడం నాకు హాబీ. ఆ హాబీ క్రమేణా అలవాటుగా మారి, ఆ అలవాటు ఆఖరుకు అభ్యాసమై వొదుల్చుకోలేని వ్యాపారంగా తాడుమార్తై కూర్చొంది.

'వ్యాపారం అని ఎందుకన్నానంటే వ్యాపారంలోలాగ దీనిలో పెట్టుబడులు, లాభ నష్టాలు లేకపోయినప్పటికి దానిలో ఉండే కలిపివేతలు, కొట్టివేతలు, అందనాలు, ఆశ్రయించడాలు బుర్రకొట్టుపెట్టి పేరు గడించడం మొదలైనవన్నీ ఇందులోకూడా ఉన్నాయి.

నా యీ వ్యాపారంలో సహాయ కార్యదర్శిని మా కాంతం.

అంచేతనే యిప్పుడీ కథ ఫెయిల్ చేసి పోస్టుచేయించమని మా ఆవిడకు పురమాయించడమైనది.

'అలాగేలెండి' అని కాంతం వంటింట్లోకి వెళ్ళింది.

నేనేమో సైకిల్ తీసుకొని కాలేజీకి బయదేరేను. కాలేజీ గేటుదగ్గిరికి వచ్చేవరకు కాంతాన్నిగురించే ఆలోచిస్తున్నాను.

ప్రాణంఅయినాసరే అర్పించేందుకు వెనకాడదు. దాసీది ఉన్నా ఇంటిపనంతా తనే పూనుకొని చేస్తుంది. అనవసరంగా యీ కథలుగూడ కాంతంచేతనే వ్రాయిస్తున్నా ఏం బాధపడుతున్నదో.

సాయంకాలం కాలేజీనుండి యింటికి వచ్చేశాను. డ్రస్ మార్చుకొంటూ

'ఏమైనా వుత్తరాలు వొచ్చాయా' అని అడిగాను.

'ఆ...మూడు ఉత్తరాలొచ్చేయి. పేడ్‌లో పెట్టేను'.

నాకువొచ్చిన వుత్తరాలన్నీ మా ఆవిడే చింపి సార్టుచేసి రెడీగా ఉంచుతుంది నే వొచ్చేసరికి. ఒకొక్కప్పుడు జవాబులు కూడ తనే వ్రాసిఉంచుతుంది.

పేడ్‌లో ఉత్తరాలు చూడకుండానే 'ఎక్కడనుండి వచ్చేయేమిటి' అని అడిగాను.

'ఆ "కాంలవాహిని" ఎడిటర్ మీరు మొన్న పంపించిన కథ టైటిల్ మార్చి మరో కొత్త టైటిల్ యిస్తే బాగుంటుందేమోనని వ్రాశాడు. మరొకటి బెజవాడనుండి ఎవరో నాటకసమితివాళ్లు మీరు వ్రాసిన నాటకం రంగంమీద ప్రదర్శించడానికి అనుమతి అర్థిస్తూ వ్రాశారు. ఇంకొకటి మీ మిత్రుడొకాయన వ్రాశాడు. క్రిందటి వారపత్రికలోఉన్న మీ కథ అత్యద్భుతంగాఉందని పొగుడ్తూ వ్రాశాడు.'

'అంతేనా...సరే — ఉదయం చెప్పిన కథ పూర్తిచేసి పంపించేశావా?'

'పంపించేశాను. కాని పంపించేముందు కథలో ఉపసంహారం [illegible] పంపించేను.'

'దుఃఖాంతాన్ని [illegible]ం చేశావా?'

'అంతే.'

'మంచిపనే చేశావు ఏదో తీరుబాటు సమయంలో కాస్త ఊసుపోవటానికి చదివే చదువరులకు కళ్లంట నీళ్లు తెప్పించడం భావ్యంకాదు.'

'వాళ్లమాట దేముడెరుగుగాని మొదట నాకే మీ కథ చదవగానె గుండె దడపట్టుకొంది. అంచేతే మార్చేశాను'.

'వేగం బట్టలు మార్చుకో, సినిమాకు పోదాం' అని తొందరపెట్టేను.

ఇవాళే కాదు. రోజూ ఇదే వరస. కాలేజీలో ఉన్న క్షణాలు తప్పిస్తే అనుక్షణం నన్ను అంటిపెట్టుకొనిఉంటుంది మా కాంతం.

బూట్లు పాలిష్ చెయ్యడం, పెన్నులో ఇంకు పొయ్యడం మొదలైన ప్రతి చిన్న విషయంతో ఆరంభించి నేను ఏరోజు ఏయే బట్టలు వేసుకోవాలో, క్లాసులో ఏ రోజు ఏ పాఠం చెప్పాలో జ్ఞాపకం చెయ్యడం మొదలైన అన్ని పనులు మా కాంతం చేసిపెట్టుంది నాకు.

ఈనిత్యకృత్యాలే కాకుండా నేను పత్రికలకు పంపే కథలు ఫెయిర్ చెయ్యడం, వాటికి టైటిల్స్ తగిలించి పోస్టు చెయ్యడం, నా కాలేజీ ప్రిపరేషన్ వర్కుకు సంబంధించిన డిక్షనరీ మీనింగులు చూసిపెట్టడం, అప్పటా అప్పటా ఏమైనా డిక్టేటుచేస్తే వ్రాయడం—అన్ని పనులూ మహా ఓపిగ్గా నావద్ద కూర్చొని చేస్తుంది.

ఇన్ని పనులు నెరవేరుస్తూ కూడా సంసారాన్ని ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా లాగించేస్తున్నది.

ఒడుదుడుకు లేకపోవడమే కాదు, సంసారం స్వర్గతుల్యం, ఆనందమయం చేస్తున్నదని ఇవతల ఇరుగు—అవతల పొరుగువాళ్లేకు

ఈర్ష్యా అసూయలు.

మా సంసారంలో రాగలోకాలు కానీ, హింసాద్వేషాలు కాని, దారిద్ర్య దౌర్భాగ్యాలు కాని ఎక్కడా మచ్చుకైనా లేవు నేనేమీ ఉత్ప్రేక్షించి చెప్పలేదు.

కాంతం నా జీవితానికో అద్భుతశోభ, ఓ మహా సౌందర్యం తెచ్చిపెట్టింది.

లోక దాంపత్య చరిత్రలో మా దాంపత్యం ఒక ప్రత్యేక ప్రకరణము.

వెనకటికి 'సంసారం సాగరం దుఃఖం' అని అన్నారు. ఆ అన్నవాళ్లెవరో నాకంట పడితే పనిమేర వాళ్ళని ఇంటికి తీసుకొనిపోయి కాంతం సంసారం చూపించి ఇప్పటికయినా మరేం తొందర లేదు మార్చెయ్యి ఆ సామెత, అని బోధ చేసేవాణ్ని

బహుశా ఆ సామెత ఎవరో సంసారం కిట్టని సన్యాసులు తమ స్వార్థంకోసం, 'పార్టీ ప్రోపగాండా' నిమిత్తం ఉపయోగించే నినాదం అని నా ఉద్దేశం

ఏది ఏమైనప్పటికీ కాంతం లేని సంసారం నాకు చెట్టుచేమలు లేని ఎడారి ప్రాయం,పంచదార వెయ్యడం మర్చిపోయిన పాయసం, చిలక లేని పంజరం.

ఇలా వుంటున్న సమయంలో హఠాత్తుగా అనుకోకుండా మా ఆవిడ పుట్టింటికి వెళ్ళవలసి వచ్చింది.

పదిహేను రోజులలో తిరిగి వచ్చేస్తానని వెళ్ళింది ఇక చూడండి నా అవస్థ రోజుకో యుగంలా గడిచేది. రోజులో చాలా సమయం అక్కడా అక్కడా లైబ్రరీలలోను, థియేటర్సులోనూ కాలక్షేపం చేస్తాండేవాణ్ని. శరత్ బాబు వ్రాసిన కథలన్నీ పూర్తి చేసేను. కాని మాఆవిడింకా రాలేదు.

నా ఆ వేదన ఆరాటం సప్తమస్థాయిలోకి వెళ్ళేయి. బహుశా నా ఆ వేదన మహోన్నత స్థితికి పోకపోతే అదే నన్ను అధోగతిపాలు చేస్తుందేమో.

ఎలాగయితేనేం రెండు వారాలు గడిచాయి. మా ఆవిడ ఓ మంచిరోజు చూసుకొని బండి దిగింది.

'అమ్మయ్య' అనుకొన్నాను మనస్సుకు శాంతి కాళ్లకు బలం వచ్చింది. కాంతాన్ని చూడగానే ఎక్కడికో క్రింది అంతస్థులోకి దిగజారిపోయిన గుండెకాయ తిన యథాస్థానాన్ని ఆక్రమించుకుంది. తుప్పుపట్టిన తలకాయ దానంతట అదే తుప్పుగులుపుకొని అప్పుడే నిద్రలోనుండి హఠాత్తుగా లేచిన వాడి మల్లే తను సిద్ధంగా ఉన్నానని తలపూపింది.

గబగబ భోంచేసి హుషారుగా కాలేజీకి వెళ్ళేను.

సాయంకాలం కాలేజీలో పని అయిపోగానే మళ్లా అంత హుషారుగా తిరిగి యింటికి వచ్చేను.

ఇంటికొచ్చేసరికి మా యింట్లో ఓ పెద్ద గాలి దుమారం లేచింది.

గాలేం మామూలు గాలా! కాదు. సుడిగాలి సుడి చుట్టిచుట్టి యింట్లో సామానన్నీ చిందరవందర చేసింది.

వీధిలోని ఇసకంతా ఒక్కుమ్మడి ఎవరో వెంట తరుముకొస్తే మా ఇంట్లో తలదాచుకొంది కాబోలు. లేకపోతే గదినిండా యీ ఇసకంతా ఏమిటి?

టేబిల్ మీద వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఉన్నాయి డ్రాయరులో వస్తువులు కూడ డైరీ, పుస్తకాలు, పెన్ను వగైరా అన్నీ చెదిరిపడి ఉన్నాయి నేను గదిలో ప్రవేశించే సరికి అవన్నీ నా వైపు దీనంగా చూస్తున్నాయి

టేబిల్ మీద టైమ్‌పీస్ కూడ భయపడిపట్టు ఉంది గుండె టక టక కొట్టుకుంటుంది.

నాకేం తోచటం లేదు. ప్రతిరోజు నేను వొచ్చేసరికి ఎదురుగా వచ్చి ఆహ్వానించే మా ఆవిడ నాకీవేళ కనబడలేదు.

వంటింట్లోకి వెళ్ళేను. ఓ మూల చెంగు పరుచుకొని పడుకొనిఉంది కాంతం.

'నేను వొచ్చేను' అని అన్నాను

'ఆ చూసేను' అని ముక్తసరిగా జవాబిచ్చింది.

నా అభిమానం దెబ్బతింది. వెంటనే గదిలోకి వచ్చేశాను. పనిమనిషిచేత కాఫీ, ఫలహారం పంపించింది. కాని, తను రాలేదు. మాటామంతీ లేదు.

ఆ రాత్రికూడ అంతే కారణం కాంతం చెప్పలేదు; నేను అడగలేదు.

ఎప్పుడూ నవ్వుతో నిండులాడే ఆమె ముఖం ఇప్పుడు కారు మేఘాలతో నిండిన ఆకాశంలా ఉంది.

నామీద ఏదో అనుమానం పట్టుకొని ఉంటుంది లేకపోతే ఊరునుంచి దిగగానే డ్రాయరు సొరుగులు అన్నీ తీసి ఇన్‌వెస్టిగేట్ చెయ్యడానికి కారణం ఏమిటి?

ఆ మరునాటిరోజు మధ్యాహ్నం భోజనాల సమయంలో నేనే కల్పించుకొని,

'సెలవల్లో ఓ మంచి కథ వ్రాశాను. ఫెయిర్ చేసే వాళ్లెవరు లేక అలా పడివుంది' అని అన్నాను.

'ఏం నేనే ఉన్నానా?' అని ఎగురు ప్రశ్న వేసింది

'మరి?' అని అడిగా'

'ఏమో నాకేం తెల్సు'

హరి భగవాన్, ఇదే మొదటి ఏమి ఎరగని దీనుడి జీవిత చరిత్రలో చిన్న గాలిదుమారం లేచి మహా ప్రళయం గా కి వెం పెట్టుగ ఉంద, ప్రళయ మేకాని ప్రారంభ మైనా కింకేమైనా అదుండదా మహా మహా వృక్షాలు సైతం వేళ్లతో సహా పెకల్లింపబడతాయి. అటువంటప్పుడు ఇటువంటి చిన్న సంసారా లొక లెక్కా?

ఒకటి కాదు 17 రకాల సువాసనలు
మిమ్ము ఉత్తేజపరచి
ఆనందపరచగలవు!




17 ఉత్తేజపరచే సువాసనలు కలిపి అద్భుతముగా తయారు చేయబడిన పామాలీవ్ నిజంగా మంచి టాల్కు... ఇది కుటుంబములో వారికందరికి . మరియు పిల్లలకు కూడా మంచిది!

టాల్కమ్ డీలక్స్

# ★ డైరీలో రాధ ★

నాకేం తోచలేదు. వెంటనే పోస్టాఫీసుకి వెళ్లి మా అత్తగారికి ఓ టెలిగ్రాం ఇచ్చేను. వెంటనే బయలుదేరి రమ్మని.

ఆ మర్నాడు కాలేజీనుండి యింటికి రాగానే మాటలు వినపడుతున్నాయి మా అత్త గారు వచ్చినట్టుగా ఉంది.

నేను బట్టలు అవి మార్చుకొని కాఫీ తాగేక మా అత్తయ్య క్షేమ సమాచారం అడిగాను.

అందరూ క్షేమంగా ఉన్నారని చెప్పి, 'ఏం నాయనా కాంతం లేనప్పుడు మనింటికి ఎవ్వరైనా వచ్చేవారా?' అని అడిగింది.

'ఎవరొస్తారత్తయ్యా. అసలు నేను ఇంట్లో ఉంటేగా. చాలా సమయం లైబ్రరీల లోను రీడింగు రూములలోను కాలక్షేపం చేసేవాణ్ని.

'మరీ తెలీకపోతే ఏం అమాయకంగా మాట్లాడుతాడు!' అని కేసంతా స్టడీచేసి తనకి తెలియనివిషయం ఏదీలేదని వాదించే ప్లీడరులాగా తన ఉద్దేశం వెలిబుచ్చింది మా కాంతం

'అది కాదబ్బాయి. కాంతం లేనప్పుడు ఎవరో రాధట యిక్కడకు వొచ్చేది అని దానికి అనుమానం'

నేను అనుకొన్నంతా అయింది. పెళ్లయిన కొత్తలో ఎవరికైనా భార్య ప్రవర్తన మీద అనుమానం కలుగుతూ ఉంటుంది. కాని నా విషయంలో కాంతమే నన్ను అనుమానిస్తు ఉన్నట్టుగా మాటలలో దొరికిపోతూ ఉండేది. కాని ఎప్పుడూ అదేమీ నేను పట్టించుకోలేదు. ఇప్పుడాలోచిస్తే యీ అనుమానం కాంతంలో ప్రగాఢంగా నాటుకు పోయి ఉందన్నీ,యిప్పుడు ఆ అనుమానం పెనుభూతమై ఆమెచేత యిల్లంతా చిందరవందర చేయించిందని తేలుతున్న సారాంశము.

నాకు ఆశ్చర్యంవేసింది. రాధ వచ్చిందా? ఎవరీ రాధ? తనకేమి తెలియదే. బహుశా తనులేని సమయంలో వచ్చిందేమో.

'ఎవరో ఆ రాధ! ఆ రాధసంగతి నాకేం తెలీదత్తయ్యా'

'తెలీదంటే సరిపోతుందా ప్రత్యక్ష ప్రమాణం ఉంటే' అని మా ఆవిడ అర్ఘ్యమెంటు.

'ప్రత్యక్ష ప్రమాణమా' అని నాలో నేను గొణుక్కొన్నాను.

'అవును ప్రత్యక్ష ప్రమాణమే'అని అంటూ డ్రాయరులో డైరీతీసి బయటపెట్టి.

'తీసి చదవండి 15 వ తారీఖున మీస్వహస్తాలతో ఏం రాసుకున్నారో.. ఆ రాధ ఎవరో జ్ఞాపకం వొస్తుంది.'

డైరీతీసి పైకి చదివేను.

"15 వ తారీఖు.

పగలంతా కాలేజీ సాయంకాలం లైబ్రరీ.. బీచ్‌లో మిత్రులతో యిష్టాగోష్ఠి ...రాత్రి భోజనం ముగించేక రాత్రి 12 గంటల వరకు రాధతో కాలక్షేపం."

ఇంకా చదవడం పూర్తిచెయ్యలేదు. మా కాంతం అందుకొంది.

'12 గం|| వరకే ఏం.రాత్రంతా ఉంచుకో లేకపోయారు? ఎవరు అడ్డు పెట్టేరు మిమ్మల్ని?'

మిగతాకూడ చదివేశాను.

"రాధ శరత్తు ఏమి అర్థం కాకుండా ఊహకు అతీతమైఉంది."

'మీసరదాలు తీరిపోతుంటే రాధ శరత్తు సంగతి మీకెందుకు' అని మా ఆవిడ కామెంటరీ.

నాకిప్పటికి అర్థమైంది. ఈ అల్లరి అంతటికీ కారణం డైరీ అన్న మాట.

నాకాశ్చర్యం, ఆరాటం అంతా మచ్చుమాయంలేకుండా ఎగిరిపోయి ఫక్కున నవ్వొచ్చింది.

నేను నవ్వుతుంటే మా కాంతానికి మరీ కోపం ఎక్కువైంది.

'నవ్వండి యింకా నవ్వండి. నవ్వి నన్ను పరిహాసంచెయ్యండి ఇంకెందుకు రేపే నా ప్రయాణం. ఆరాధను ఇక్కడకే తెచ్చి అట్టే పెట్టుకోండి' మా కాంతం ఉక్రోషంతో అన్నమాటలు.

'నన్నేమైనా చెప్పనిస్తావా, అంతా నీ సొదేనా'

'ఏంనాయనా ఏం జరిగిందేమిటి?' అని మా అత్తయ్య ఆత్రుతగా అడిగింది

'మరేం లేదు అత్తయ్యా. ఆరాధ శరత్‌బాబుగారి రాధ.'

'ఎవరా శరత్‌బాబు? ఈ వీధిలోనే ఉన్నాడా?' అని మా అత్తయ్య అమాయక ప్రశ్న.

'అదికాదత్తయ్యా' శరత్‌బాబు ప్రసిద్ధ బెంగాలీరచయిత. అతను వ్రాసిన పుస్తకాలలో "రాధ" అనే పుస్తకం ఒకటి. "

'అయితే 12 గం|| వరకు రాధతో కాలక్షేపం ఏమిటి?' అని మా కాంతం ప్రశ్న.

'రాధతో కాలక్షేపం అంటే 'రాధ' అనే నవల చదువుతూ కాలక్షేపం చేశానని మా ఆవిడ ఆశ్చర్యానికి అంతులేదు.

'డైరీలో రాధ ఎంతపని చేసింది' అని మాత్రం తనలో తను అనుకొని నాముందు నిల్చోడానికి సిగ్గువేసింది కాబోసు, వంటింట్లోకి ఒక్క పరుగు తీసింది

అదిమొదలుమా సంసారం మళ్లా స్వర్గసీమ. ఆనందమయం నిత్యకళ్యాణం పచ్చతోరణం. ★


చర్మ బాధలకన్నిటికి

"సైబాల్"




చర్మవ్యాధులన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస బేబి గ్రైప్"




తయారుచేయువారు

దిసౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.